## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### భక్తిశ్రద్ధలతో హోమం



నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. ఆదివారం సుప్రభాత సేవతో ప్రారంభమై, బాల భోగ నివేదన, నీరాజనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నిత్యహోమాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ–ఆంజనేయ హవనం పూర్ణాహుతి చేపట్టారు. సాయంత్రం విష్ణుసహస్ర నామపారాయణ జరిగింది. అనంతరం ఉత్సవమూర్తులను కనుల పండువగా అలంకరించి విశేష శోభాయాత్ర నిర్వహించారు. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### జైహింద్ గురూజీ సేవలు అభినందనీయం

డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



గుంటూరు వెస్ట్: యోగాతోపాటు మాస్టర్స్ అథ్లెట్స్‌లో రాణిస్తున్న జైహింద్ గురూజీ దంపతుల సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ కొనియాడారు. గత నెల 30 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు గోవాలో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 12వ నేషనల్ గేమ్స్‌లో డాక్టర్ జైహింద్ గురూజీకి యోగా, 100, 800, 1500 మీటర్ల పరుగులో వరసగా నాలుగు బంగారు పతకాలు, ఆయన సతీమణి సుబ్బాయమ్మకు స్విమ్మింగ్, జావెలిన్ త్రో, జావెలిన్ త్రోలో మూడు బంగారు పతకాలు మొత్తం 7 బంగారు పతకాలు వచ్చాయన్నారు. వారిని ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్‌లో రాయపాటి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్ సిద్ధార్థ్, పార్థసారథి, కొమ్మినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ



నగరంపాలెం: స్థానిక కొత్తపేట జగన్నాథ స్వామి దేవస్థాన ఆవరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.

- స్థానిక లాలాపేట పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. భక్తుల దర్శనార్థం శ్రీస్వామి వారికి దశావతారాల అలంకారం చేశారు. ఉదయం 108 కలశలతో అష్టోత్తర సహస్ర అభిషేకాలు నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి, శ్రీస్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

### కాజలో ఏరువాక పౌర్ణమి రేపు

కాజ(మంగళగిరి): గ్రామంలో మంగళవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెదకాపులు ఆదివారం తెలిపారు. కాజలోని శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వేడుకల వివరాలను వెల్లడించారు. పౌర్ణమి సాయంత్రం గ్రామ సెంటర్‌లోని శ్రీ రత్న గర్భ విఘ్నేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఏరువాక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవంలో గుడికి నాలుగు వైపుల గల స్తంభాల మీద నుంచి ఉండ్రాళ్లను స్వామివారి ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టనున్నారు.

# మహిళా విద్యకు చిరునామా

- ప్రగతి పథంలో ప్రభుత్వ మహిళా కళాశాల
- పేద, మధ్య తరగతి విద్యార్థినులకు వరం
- యూజీసీ అటానమస్ హోదాతో పాటు నాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు
- ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సులకు ధీటుగా డిగ్రీలో వివిధ కోర్సులు
- దూర ప్రాంత విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే వసతి గృహం
- డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాల కల్పన



కంప్యూటర్ ల్యాబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల మహిళా విద్యకు చిరునామాగా నిలిచింది. కళాశాల ప్రగతి పథంలో పయనిస్తోంది. బ్రిటీషు పాలనలో లేడీ హోప్ కళాశాలగా ప్రారంభమైన సరస్వతీ నిలయం ఎనిమిది దశాబ్దాల చరిత్ర సొంతం చేసుకుంది. డిగ్రీ, పీజీ కోర్సులతో విద్యార్థినులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతూ జిల్లాకే మణిహారంగా నిలిచింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మంజూరు చేసిన స్వయం ప్రతిపత్తి(అటానమస్), ఇటీవల నాక్ (ఏ) గ్రేడ్ గుర్తింపు తన మణి కిరీటంలో అలంకరించుకుంది.

**వసతులు ఇలా..**

1942లో గుంటూరు సాంబశివపేటలో 16 ఎకరాల సువిశాల స్థలంలో స్థాపించారు. ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, రీడింగ్‌రూం, జవహర్ విజ్ఞాన కేంద్రం వంటి పూర్తిస్థాయి వసతులతో పాటు సామాజిక, ఆర్థిక పరిస్థితులు, ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని కాలానుగుణమైన కోర్సులతో ముందుకెళుతోంది. యూజీ స్థాయిలో 24, నాలుగు పీజీ కోర్సులతో పాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ ల్యాబ్స్‌తో సాంకేతిక విద్య అందిస్తోంది.



ప్రభుత్వ మహిళా కళాశాల భవన సముదాయం

**ఆధునిక కోర్సులకు రూపకల్పన..**

స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా పొందిన మహిళా కళాశాల, ఇటీవల నాక్ నుంచి 'ఏ' గ్రేడ్ గుర్తింపు పొందడంతో మరో పదేళ్ల పాటు అటానమస్ హోదా కొనసాగనుంది. కళాశాలలో 2018–19లో 2,070 మంది విద్యార్థినులు ఉండగా, ఐదేళ్లలో ఆ సంఖ్య పెరిగి ప్రస్తుతం 2,522కు చేరింది. పాఠ్యాంశాల బోధనకు 72 మంది రెగ్యులర్ అధ్యాపకులు పని చేస్తుండగా, ఇద్దరు కాంట్రాక్టు, 19 మంది గెస్ట్ ఫ్యాకల్టీ కలుపుకుని మొత్తం 93 మంది అధ్యాపకులు ఉన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థినులకు అందుబాటులో ఫీజులతో నడుస్తున్న కళాశాలలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా ఎంసెట్ తరహాలో ఆన్‌లైన్ ద్వారా సీట్ల కేటాయింపు చేస్తోంది. విద్యార్థినులు ఇంటర్‌లో సాధించిన మార్కుల ఆధారంగా సీటు పొందిన విద్యార్థినులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. వసతి గృహం అందుబాటులో ఉండటంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశం పొందవచ్చు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు కార్పొరేట్ సంస్థలతో పాటు దాతల సహకారంతో ప్రతి యేటా ఉపకార వేతనాలు అందిస్తున్నారు.

**డిగ్రీలో వివిధ కోర్సులు..**

డిగ్రీ కళాశాల అంటే కేవలం బీఏ, బీకాం వంటి సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా కాలానుగుణంగా సత్వర ఉపాధి, ఉద్యోగావకాశాలకు కల్పించే సాంకేతిక విద్యా కోర్సులను కళాశాల అందిస్తోంది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సులకు ధీటుగా బీఎస్సీ ఆనర్స్, డేటాసైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బీఎస్సీ మాథ్స్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌తో పాటు ఫార్మసీకి ప్రత్యామ్నాయంగా బీఎస్సీ కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, ఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, ఎనలైటికల్ కెమిస్ట్రీ, పీజీలో ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, పీజీఈజీ, పీజీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, జువాలజీ కోర్సులు అందిస్తోంది. వైవిధ్యమైన కోర్సులతో పాటు కళాశాల విద్య ఆధ్వర్యంలో ప్రతి ఏటా మెగా జాబ్‌మేళా నిర్వహించి, డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలను కల్పిస్తున్నారు.

**జేకేసీ ఆధ్వర్యంలో..**

డిగ్రీ చదువుతో పాటు కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం(జేకేసీ) ఆధ్వర్యంలో భాషా, భావ వ్యక్తీకరణ, సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ పొందవచ్చు. కార్పొరేట్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించి, విద్యార్థినులకు ఉన్నతస్థాయిలో కొలువులు అందిస్తున్నాయి. డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి షెడ్యూల్ విడుదల చేయనుంది.

**పేద, మధ్య తరగతి విద్యార్థినులకు మేలు**



ఘన చరిత్ర కలిగిన మహిళా కళాశాలలో ప్రవేశాలు పొందడం పేద, మధ్య తరగతి విద్యార్థినులకు ఎంతో ప్రయోజనకరం. చదువుతో పాటు పరిశోధనలు, ప్రాజెక్ట్ వర్క్స్, క్షేత్రస్థాయిలో పరిశ్రమల సందర్శన ద్వారా విజ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం. దాతల సహకారంతో ఐదేళ్లలో విద్యార్థినులు రూ.37.85 లక్షల ఉపకార వేతనాలు అందించాం. ప్రస్తుతం కంప్యూటర్ కోర్సులకు అధికంగా డిమాండ్ ఉండటంతో అని విభాగాల్లో కంప్యూటర్ కోర్సులను అందిస్తున్నాం.

– డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, ప్రిన్సిపాల్

### పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



నూతక్కి(మంగళగిరి): పాఠశాలలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి విజ్ఞాన విహార విద్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి వర్షారంభ సమావేశాలను విద్యా భారతి ప్రాంత అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. సమావేశాలలో రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక యోజన, పాఠశాల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పడానికి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్య మాత్రమే సమాజంలో మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు. విద్య విలువ తెలుసుకుని రాణిస్తే మనిషి ఉన్నత స్థాయికి చేరడంతో పాటు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో విద్యా భారతి రాష్ట్ర కార్యదర్శి జె.ప్రతాప్ సింహశాస్త్రి, సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, ఉపాధ్యక్షుడు వెలగపూడి రామకృష్ణ, భారతి క్షేత్ర ప్రతిక్షణ ప్రముఖులు రావుల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### బెంగళూరు తొక్కిసలాట ఘటన దురదృష్టకరం

లక్ష్మీపురం: బెంగళూరు స్టేడియం ఘటన దురదృష్టకరం అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.

### 15న 'కేసన'కు సత్కారం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావుకు ఈనెల 15న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అభినందన సత్కారం జరగనుంది. పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. చినరావూరు వాకర్స్ సొసైటీ కార్యదర్శి జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలంటూ బీసీ సంక్షేమ సంఘం తరఫున కేసన శంకరరావు దీర్ఘకాలంగా ఉద్యమిస్తున్నారనీ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసినట్టు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కులగణనకు సిద్ధమైన తరుణంలో కేసన శంకరరావును సత్కరించనున్నట్టు తెలిపారు. ఇదే సభలో శంకరరావు అభినందన సంచికను విడుదల చేస్తామన్నారు. సభకు కేంద్ర, రాష్ట్రమంత్రులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఓంకార్ ప్రసాద్, అక్కల వెంకటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీం జాని, బి.నరసింహారావు, ఎ.సాంబశివరావు, ఎం.మల్లికార్జునరావు, సీహెచ్. సాంబశివరావు, ఎ.ఏడుకొండలు, ఈఎల్‌వీ అప్పారావు, పూర్ణచంద్రరావు, ఎస్.సతీష్ పాల్గొన్నారు.

# స్కాంలు తప్ప.. స్కీంలు లేవు...

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కాంలు తప్ప.. స్కీంలు లేవని వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షులు ఈమని రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏడాది కాలంలో చంద్రబాబు సర్కార్ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇటీవల జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనటమేనని పేర్కొన్నారు. కనీసం మహిళలకు ఇస్తానన్న ఉచిత బస్సు తుస్సుమనించారని, తల్లికి వందనానికి మంగళం పాడారని, గ్యాస్ సబ్సిడీ లీక్ అయిపోయిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యపడిందన్నారు. కరోనా సమయంలో సంక్షేమ పథకాలను ప్రతి పేద వాడి గడప ముందుకు చేర్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. పథకాలు ఇవ్వలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ.. ఇదేమని ప్రశ్నిస్తే.. దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలపై మేధావులు, విద్యావేత్తలు, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ గళమెత్తాలని కోరారు. అప్పుడైన ప్రజలకు మేలు జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పటికైనా చెల్లించాలని యూనియన్ నాయకుల స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు 170 మంది మరణించారని ఆయన అన్నారు. అయినప్పటికీ యాజమాన్యంలో స్పందన లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గురవయ్య, దానయ్య, నవనీతం, ఇమాంబి, దుర్గాభవాని, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, హగ్గయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మికులు, యూనియన్ నాయకులు

### 11న ఉపకులపతి శ్రీనివాస రావుకు సాంబయ్య స్మారక పురస్కారం

నగరంపాలెం: ఈనెల 11న బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై విద్యాప్రదాత సాంబయ్య వర్ధంతి, ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్, సిహెచ్.సాంబయ్య స్మారక పరిషత్ వ్యవస్థాపకులు సీహెచ్ భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావుకు సీహెచ్ సాంబయ్య స్మారక పురస్కారంతో సత్కరించనున్నట్లు చెప్పారు. సభానంతరం కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఉంటాయని అన్నారు.

# ఇదేనా స్వచ్ఛ గుంటూరు



డీఈవో కార్యాలయం ఎదుట వర్షపునీటితో నిండి, దోమలకు ఆవాసంగా మారిన ఖాళీ స్థలం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిపాలనా వ్యవస్థకు కేంద్ర బిందువైన కలెక్టర్ కార్యాలయం పక్కనే భారీ మురుగునీటి తటాకం దర్శనమిస్తోంది. డీఈఓ, రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లే మార్గంలోని ఖాళీ స్థలంలో చేరిన వర్షపునీటిని తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెంది, స్వైర విహారం చేస్తున్నాయి. డీఈఓ కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు, రిజిస్ట్రార్ కార్యాలయానికి నిత్యం వందలాదిగా వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా కార్యాయాలకు వచ్చే ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఉపయోగించే స్థలం వర్షపునీటితో నిండి. దుర్గంధం వ్యాపింపజేస్తోంది. స్వచ్ఛ గుంటూరు అంటూ ఆర్భాటంగా ప్రకటిస్తున్న నగరపాలకసంస్థ అధికారులు జిల్లా కలెక్టరేట్ పక్కనే మురుగునీటి తటాకంగా మారి, చెత్త వ్యర్థాలతో నిండిన ప్రాంగణాన్ని పట్టించుకోవడంపై ఉపాధ్యాయులు, స్థానికులు విమర్శిస్తున్నారు.

# ప్రధాన రహదారిపై చిన్నచూపు



బృందావన్‌గార్డెన్స్ ప్రధాన రహదారిలో గుంతలు



ఓ బ్యాంక్ వద్ద రోడ్డు సైడు కంకరతేలిన రహదారి



రాజేంద్రనగర్ ఒకటో వీధి మొదట్లో అధ్వానంగా మురుగుకాలువ

- ఎత్తు పల్లాలుగా ఉండటంతో రాకపోకలకు ఇక్కట్లు
- ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్తే ప్రమాదాలకు గురికావాల్సిందే
- అక్కడక్కడ గుంతలతో బృందావన్‌గార్డెన్స్ ప్రధాన రహదారి

నగరంపాలెం: అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎత్తు పల్లాలుగా ఉన్న ప్రధాన రహదారిపై రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. కొంచెం వేగంగా వెళ్లిన వాహనాలు అదుపుతప్పి కిందపడిపోవాల్సిందే. అటుగా ప్రభుత్వ అధికారులు, పాలకులు ప్రయాణిస్తున్న ఎవరూ పట్టించుకోవడంలేదు. నగర ప్రజలకు ప్రధానమైన రహదారి అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం చోదకులను మరింతగా ఇక్కట్లకు గురిచేస్తున్నాయి.

**లోతట్టు గుంతలు..**

గుంటూరు నగరంలో ప్రధానమైన రహదారుల్లో బృందావన్‌గార్డెన్స్ ఒకటిగా చెప్పొచ్చు. ఈ మార్గం మీదగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. చాన్నాళ్ల క్రితం బృందావన్‌గార్డెన్స్ నుంచి చేబ్రోలు హనుమయ్య సర్కిల్ వరకు తారు రోడ్డు నిర్మించారు. గతంలో అక్కడక్కడ గుంతలు ఉన్నచోట తాత్కాలిక మరమ్మతులతో చదును చేశారు. అయితే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులు కారణంగా రహదారి ఎత్తు పల్లాలుగా మారాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లిన ప్రమాదవశాత్తు కిందపడిపోవాల్సిందేని చోదకులు వాపోతున్నారు. రహదారి దూరంగా చూస్తే బాగానే ఉంటుందని, అటుగా వెళ్తేగానీ గుంతలు కనిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రధాన రహదారిలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయం, నగరపాలక సంస్థ సర్కిల్ కార్యాలయం, ప్రైవేటు బ్యాంక్‌లు, హోటల్స్ తదితర దుకాణాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు వచ్చే పోయే వారి రాకపోకలతో రాకపోకలతో రద్దీగా ఉంటుంది.

**అక్కడకక్కడ సైడు కాలువలు లేవు..**

ఈ ప్రధాన రహదారిలోని అక్కడక్కడ సైడు కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. సిమెంట్ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారిపైకి, ఖాళీ స్థలాల్లోకి చేరుతుంది. రాజేంద్రనగర్ ఒకటో వీధి మొదట్లో మురుగుకాల్వ అధ్వానంగా ఉంది. మట్టితో ఏర్పాటు చేయడంతో మురుగునీరు వంకలుగా వెళ్తుంది. క్లాసిక్ టవర్స్ వద్ద కాల్వ దారుణంగా మారింది. కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. మురుగునీరు నిలిచి వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నగర శివార్లల్లో నూతన రహదారులు, ఇరువైపులా కాలువల నిర్మాణాలు జరుగుతుంటే, నగర వాసులకు కీలకమైన ప్రధాన రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, దుకాణదారులు, చోదకులు కోరుతున్నారు.

# క్యాన్సర్‌ను అవగాహనతోనే జయించాలి

ప్రముఖ ఆంకాలజిస్ట్ మహతి

లక్ష్మీపురం: ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలలో ప్రధానమైనది క్యాన్సర్ సమస్య అని ప్రముఖ ఆంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ టి.మహతి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి గుర్తించినప్పుడు అధైర్య పడకవెంటనే తగు వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకున్నవారు సాధారణమైన జీవితాన్ని ఆనందంగా గడపవచ్చుఅన్నారు. ఇటీవల ఈ క్యాన్సర్ వ్యాధికి సంబంధించి అనేక అధునాతన వైద్య పద్ధతులు వచ్చాయని వివరించారు. క్యాన్సర్‌కు వ్యాక్సిన్ అవకాశం ఉందని, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా ఈ క్యాన్సర్ రాకుండా నియంత్రణ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మహతిని ఘనంగా సత్కరించారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, ఆరోగ్యవిషయాల విశ్లేషకుడు వి.వి.రావు, స్కాట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ శ్రీనివాసరావు , కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ పి.ఆర్.ఓ వై.వి.రెడ్డి పాల్గొని ప్రసంగించారు.




మాట్లాడుతున్న ప్రముఖ ఆంకాలజిస్ట్ మహతి

# సీపీఐ బలోపేతానికి కృషి

లక్ష్మీపురం: సీపీఐ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ కోరారు. గుంటూరు చాకలి గుంట 17వ డివిజన్ సీపీఐ సీనియర్ నాయకులు మొహిద్దిన్ పీరా అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ల పేరుతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఆగస్టు నెల 4, 5 తేదీలలో జిల్లా మహాసభలు గుంటూరులో జరగనున్నాయని అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు 23, 24, 25, తేదీలలో ఒంగోలు నగరంలో జరగబోతున్నాయని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహాసభలు పూర్తి అయిన తర్వాత సెప్టెంబర్‌లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని ఆయన వెల్లడించారు. అనంతరం డివిజన్ నూతన శాఖ కార్యదర్శిగా చినిపోతుల విజయకుమార్‌తోపాటు 7 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల ఆనందరావును సన్మానించారు. ఈ మహాసభలో నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు మిట్టపల్లి మహేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అజయ్‌కుమార్

### జూలై 10 నుంచి టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు



తెనాలి: స్థానిక బోసు రోడ్డులోని ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘం–తూర్పు గుంటూరు సినడ్ క్రీస్తు దేవాలయం (టౌన్ చర్చి) శత వార్షికోత్సవాలకు అంకురార్పణ చేశారు. చర్చి ప్రాంగణంలో జూలై 10,11,12 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాల పోస్టరును ఆదివారం ఆవిష్కరించారు. ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, అడిషనల్ పాస్టర్లు యామర్తి లెనిన్‌బాబు, దగుగ్మల్లి సాల్మన్‌రాజు, వీబీ ప్రకాష్‌బాబు మత్తె, అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఐనంపూడి డేవిడ్‌రాజు, డాక్టర్ శ్యామ్‌ప్రకాశరావు గారపాటి, చల్లాపల్లి ఫ్రాన్సిస్ జేవియర్, సుదర్శనం జాన్‌మోహన్, చెరుకూరి సునీల్‌కుమార్, కారుమంచి చంద్రకుమార్, గల్లే దేవదానం, గురిందపల్లి వేమయ్య, కొమ్మెర్ల అంబేడ్కర్, బేతాళ కిశోర్‌బాబు, బడుగు బుజ్జిబాబు, నక్కా కృపా సాగర్, జొన్నకూటి శ్యామ్‌కుమార్, గేరా రాజు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com